# వెలుగుపూలు

ఆ తలుపులెంత బరువుగా ఉన్నాయో. ఎంత నెట్టినా ఎంతకీ మూతపడవు. ఏదో ఒక వస్తువు ఇవతలికి వచ్చేస్తోంది. మళ్ళీ గబగబా వాటిని లోపలకు సర్దేసి, తలుపు గడియ పెట్టేందుకు చూడడం ఎంత ప్రయాస. నా రెండు చేతుల్లో బలం ఎంతకని చాలుతుంది. ఎవరైనా సాయం వస్తే బావుండు. ఆ తలుపులు ఎప్పటికీ తెరుచుకోకుండా మూసేద్దును.

చేతులు వణికిపోయి వళ్ళంతా చెమటలు పట్టేసి, నా శక్తి అంతా తోడేసినట్లు ఆ ప్రయత్నానికి ఖర్చు పెట్టాక, ఎప్పటికో... ఎప్పటికో గట్టిగా లాగి దగ్గరకు చేర్చగలిగాను. ఇప్పుడు నన్ను నేను చూసుకుంటే ఎంత ఆశ్చర్యంగా ఉందో. లావుగా అయిపోయాను. వళ్ళంతా వదులయిపోయి, నా అందమంతా పోయి బలహీనపడి సరిగ్గా ఎల్లా ఉన్నానంటే... నేను చెరుకురసం పోసిన గ్లాసుననుకో, నా నెత్తిలోంచి స్ట్రా వేసి నాలో రసాన్నంతా పీలిస్తే ఎలాగుంటాను? సరిగ్గా అలా... నేను కష్టపడి దగ్గరకు లాగిన ఆ ఎత్తయిన, బలమైన తలుపుల వంక తలెత్తి చూస్తుంటే గడిచిపోయిన రోజులు తలుచుకొంటే, ఎంత నిరాశగా, ఉక్రోషంగా ఉందో. ఎంత అందమైన డిజైన్లు. అన్ని పూవులు, లతలు, గులాబీ మొగ్గలు అచ్చం మంచి

గంధం చెక్కలతోనే. ఎంత నైపుణ్యంతో ఆ నగిషీలు చెక్కారంటే, ఎవరికైనా సరే ఆ తలుపులు తెరుచుకొని లోపలికి వెళ్ళిపోవాలనిపిస్తుంది. ఆ నగిషీల్లోనే బుల్లిబుల్లి మోగని గంటలున్నాయి. అవన్నీ అచ్చం మోగే గంటల్లా ఉన్నాయి. చూస్తుంటే ప్రతి గాలికీ కదిలి గలగలమంటూ శబ్దం చేస్తాయని అనిపిస్తుంది. కానీ ఎన్నేళ్ళుగా... వందేళ్ళు... రెండు వందలేళ్ళు... అంతకంటే ఎక్కువనా? అప్పటి నుంచి సన్నని సవ్వడైనా చేయలేదు. పువ్వులూ అంతే, మొగ్గలూ అంతే. ప్రాణం ఉన్నట్లుగానే భ్రమింపజేస్తాయి. అందమైన పువ్వులు వికసించమన్నంత వరకే వికసించి, వికాసం ఆగిపోయిన మొగ్గలు. నవ్వొస్తోంది. సరిగ్గా అంతే కదా!

ఆ వేళ... లోపలికి అడుగుపెట్టినప్పుడు ఈ ద్వారం ఇంత కష్టపెట్టలేదు. అలా చేయి తగలగానే ఇలా అలవోకగా తెరుచుకుంది. లోపల చల్లని సుగంధపు గాలి వస్తోంది. అలా సాంబ్రాణి ధూపం వయ్యారాలుపోతూ పైపైకి ఎగిరిపోతోంది. కలకూజితాలున్నాయి. వెన్నెలుంది. అందమైన పడకలున్నాయి. శరీరశోభ కన్పించేలా చుట్టూతా అద్దాలున్నాయి. చంద్రుడి మీద కాలు పెట్టినట్టుగా ఒక వేలితో అలా నేల మీద తాకితే పైపైకి ఎగిరిపోయేంత తేలిగ్గా ఉందక్కడి గాలి. నా వెనకగా, నా ముందుగా, ఎందరెందరో అరమోడ్పు కళ్ళతో ఎవ్వరినీ పట్టించుకోకుండా, అలా ముట్టుకొంటే తెరుచుకొంటున్న ఆ తలుపులు నెట్టుకొని లోపలికి వస్తూనే ఉన్నారు. వందలాది, వేలాది మంచాలు. అలా వాళ్ళు కూర్చునీ కూర్చోగానే మాయమై పోతున్నాయి. నా యజమాని నా కోసం చూపించిన అందమైన మంచాన్ని నేను ముట్టుకున్నాను. ఎంత అందంగా ఉందనీ. పట్టు పరదాలు, పరుపులు, దిండ్లు, సువాసనల మల్లెపూవులు, వళ్ళంతా కనిపించే దేవతా వస్త్రాలు. నేను కలలో కూడా ఊహించని అందాల లోకంలోకి అడుగుపెట్టాను. నా యజమాని నన్నెంత ఆరాధించేవాడంటే పగలూ, రాత్రి తేడా లేని ఆనంద లహరిలో నేను మునిగి తేలి సముద్రాన్నయ్యేదాన్ని. నా అనుభవాలో జ్ఞాపకాలుగా నా వొడిలో బుల్లిబుల్లి పాపాయిలు. వాళ్ళలో కొన్ని స్వయంప్రకాశాలు. నా యజమానిలాగే ఆ పాపాయిలు ధీమాగా చూస్తారు. గట్టిగా మాట్లాడతారు. ఆ పాపాయిలకు పుట్టుకతోనే చేతుల్లో, కళ్ళల్లో కత్తులున్నాయి. ఆ పాపాయిలు ఆకలేస్తే ఎంతయినా తినగలరు. దర్జాగా తిరగగలరు. నన్ను లోపలికి రానిచ్చిన ఆ తలుపులు వంగి వినయంగా వాటికి దారి ఇస్తాయి. ఇక నా వొడిలో మిగిలిన మొగ్గల్లాంటి పాపాయిలు. ఇవి నాలాగా చాలా సుకుమారంగా ఉన్నాయి. ఏం చెప్పినా వింటాయి. ఏం నేర్పినా ఇట్టే నేర్చుకుంటాయి. గాలి గట్టిగా వీచినా భయపడతాయి. ఏదైనా మిగిలితేనే చాలా నెమ్మదిగా, కుదురుగా కూర్చుని తింటాయి. ఎంత వినయంగా ఉన్నాయంటే నా యజమాని, అవన్నీ అచ్చం నా అంత బాగున్నాయని, నేను అదృష్టవంతురాలినని మెచ్చుకున్నాడు కూడా.

నేనున్న పరిధే మామూలుగా విశాలం. అచ్చం భూమంత విశాలం. అయితే నేనెప్పుడన్నా

చేతులుజాపి రివ్వున తిరగాలనుకున్నాననుకో లేదా సొంతంగా అటుఇటు స్వేచ్ఛగా గంతులేయాలనుకొన్నాననుకో. అప్పుడెందుకో ఆ తలుపులు దగ్గరగా వచ్చేస్తాయి. చుట్టూ అంతా ఇరుకైపోతుంది. నా చిన్నపాపాయిల సంగతీ అంతే. ఒకదాన్ని నేను ఆశ అని, రెండో దాన్ని కాంతి అని పిలుస్తాను. ఆశ,కాంతి ఎప్పుడైనా స్వయంప్రకాశాల్లా ఆడుకోవటానికి పరిగెత్తాయనుకో, తలుపులు దగ్గరికి వచ్చేస్తాయి. మా ముగ్గురి చుట్టూ అంతా ఇరుగ్గా ఊపిరి ఆడనట్లు ఉంటుంది. వెంటనే మేం అలా ఆడటం మానేసి మాకు రోజూ చేసేందుకు ఉన్న పనులు, అంటే  ఆ విశాలమైన చోటుని శుభ్రం చేయటం, తినేందుకు ఆహారం తయారుచేయటం, పడకని అందంగా అలంకరించటం, నా మేలి ముసుగు అందంగా కనిపించేందుకు ముత్యాలు కుట్టుకోవటం వంటి పనులు మొదలుపెడతాం. తలుపులు దూరంగా పోయి, మళ్ళీ చుట్టూ అంతా విశాలమైపోతుంది. ఆశని, కాంతిని స్వయం ప్రకాశాల్లాగా, నా యజమానిలాగా హాయిగా ఉంటే  చూడాలనే కాంక్షని ఎంతోకాలం మనసులో దాచి ఉంచాను. నేను మాత్రం ఏం చేయగలను? నాకున్న చోటు ఒకే ఒక పెద్ద మంచం. అది నేనొక్కదాన్ని ఉన్నప్పుడు చిన్నగా, ఇరుగ్గా ఉంటుంది. నేనెటూ ఆలోచించలేను. కదలలేను. ఊపిరి పీల్చలేను. నా యజమాని తలుపు దగ్గరకు రాగానే అవి గబుక్కున తెరుచుకొంటాయి. నా మంచం విశాలమై పోతుంది. నా యజమాని సరిగ్గా ఆ మంచం దగ్గర ద్వారానికి ఎదురుగా కూర్చుంటారు. ఆయన అక్కడే చాలామందితో కబుర్లు చెపుతారు. నవ్వుతారు. సంతోష పడతారు. ఆయన వెనకాల నేను ఇరుక్కుపోతాను. ఆయన ముందు ఏమున్నదో తెలుసుకోలేనంత చిన్న మనిషిని. నేనో మరుగుజ్జుననుకోండి. నాకంతా చీకటి చీకటిగా ఉంటుంది. అలవాటుగా నేను ఎప్పుడూ చేసే పనులను వెలుగు లేకపోయినా చక్కబెట్టేయగలను. ఆయన ఏదైనా తనకు కావలసిన వస్తువు ఇమ్మని వెనక్కు చేజాస్తారు. ఆ వస్తువు ఆయనకు అందిస్తూ ఆయన ముందరికి చూడాలని ఎంతో ప్రయాస పడతాను. అంతా వృథా ప్రయాస.

ఒక్కసారాయన ఎందుకో నన్ను తీరుబాటుగా గమనించారు. అందమైన నునుపైన నా వంటినీ పొందికగా నేను చేసుకున్న వస్త్రధారణను కొంచెం ఆశ్చర్యంగా మెచ్చికోలుగా చూశారు. ఆయన ముందు నేనెంత చిన్న దాన్నవుతానంటే... ఆయన వేలికి ఉన్న ఉంగరాన్ని ఎవరికైనా చూపించినంత తేలిగ్గా నన్ను అలా ప్రదర్శించేయవచ్చు. సరిగ్గా అలాగే నన్ను ఆయన తన ముందుకి తెచ్చారు. కళ్ళు చెదిరిపోయాయి. ఎంత వెలుగనీ... నేను రోజూ చూసే అగరుధూపం. చందన స్పర్శ. మల్లెపూల వంటి వెలుతురు కాదు. అపూర్వమైన కాంతిపుంజం. ఆ వెలుతురులో నా ముందున్న ప్రపంచంవైపు నేను కన్నార్పకుండా చూశాను. పెద్ద భవనాలున్నాయి. ఎగిరే విమానాలున్నాయి. స్వేచ్ఛగా నడిచే మనుషులున్నారు. అందరి మొహాల్లో ఓ వెలుగు. ఒక తీక్షణత. ఒక తెలివి. నేను రోజూ చూసే నాలాంటి వాళ్ళ కళ్ళు అలాగ లేవు.

వాళ్ళు ఎందుకలా ఉన్నారని, ఆ తేజస్సు ఏమిటని, నేను నా యజమానిని అడిగేను. నేను అందంగా ఉండటమూ, ఆ పోయే జనం నన్ను అబ్బురంగా చూడటమూ గమనించి నన్ను కలిగి ఉన్నందుకు నా యజమాని చాలా సంతోషంగా ఉన్నానన్నాడు. ఆ ఆనందంతోనే అది చదువనీ, అలా చదువు నేరిస్తే జ్ఞానం వస్తుందనీ, ఆ జ్ఞానంతో ఎన్నో సంపదలు సంపాదించవచ్చుననీ చెప్పేరు. సంపాదించటం అన్న మాట నేనప్పుడే వినటం. నేను కన్న స్వయం ప్రకాశాలు ఆ బజార్లోనే హాయిగా అల్లిబిల్లి తిరుగుతున్నాయి. ఆశ, కాంతిని కూడా అలా వదిలేయనా అన్నాను నేను. నా యజమాని మొహం చిట్లించాడు. ఏమనుకున్నాడో నన్ను వెంటనే వెనక్కి పంపేశాడు. నేను వెనక్కి వెనక్కి వెనక్కి చీకట్లోకి నడిచి వచ్చాను. నేను నిలబడిన ఇరుకు చోటు, నన్ను చుట్టుముట్టిన ఆశ, కాంతి. నా కళ్ళను ఇంకా మెరిపిస్తున్న నేను చూసిన వెలుగు. ఆ వెలుతురు పూవు నాకు కావాలి. నా ఆశ, కాంతి అక్కడే స్వేచ్ఛగా అల్లిబిల్లిగా తిరగాలి. నేను చీకటి కడుపులోంచి ఆ వెలుగు వైపు నడవాలి. ఎల్లా... నేనున్నదే చీకటిలో. నాకు దొరికేది మల్లెలూ, మంచమూ, పరదాలూ, తలగడలూ. ఇష్టమూ, అయిష్టమూ అన్న ప్రశ్న లేకుండా నా యజమానికి, నా శరీరం తృప్తి నివ్వటమూ, అందుకు ప్రతిఫలంగా నేను నడిస్తే నా వెనకాల నడిచివచ్చే గోడల మధ్య బతకడం. నా బుల్లి మొగ్గల్ని ఇంట్లోనే ఎక్కడో సౌకర్యంగా అమర్చి ఎవరికీ ఇబ్బంది కలుగకుండా చూడటం. నాకిక రాత్రింబవళ్ళు ఒకటే యోచన. ఆ వెలుగు నాకెల్లా?

నేనున్న చోటు అమరిగ్గా ఉంచటం నాకు చేతనయ్యేది కాదు. పోనీ నేర్చుకుందామంటే నా నేస్తాలూ అలాగే ఉండేవాళ్ళు. ఏది ఎలా అమర్చాలో, ఉంచాలో చెప్పి చెప్పి నా యజమానికి విసుగు కలిగింది కాబోలు. నాకు కొన్ని పాఠాలు మొదలుపెట్టాడు. అలా నేర్చుకొంటే నీవుండే ప్రదేశం అమరిగ్గా ఉంచుకోగలవు, నీకే వీలుగా ఉంటుంది అన్నారు. నేర్చుకోవటం నాకెప్పుడూ ఇష్టమే. ఎంత ఉత్సాహంగా నేర్చుకొన్నానంటే. చివరికి ఆ ఉత్సాహం, నా యజమానికి వచ్చేసి, ఆయన కెంత జ్ఞానం ఉందో నేనంతా నేర్చుకోగలిగేనన్నమాట. నేనున్న చోటికి, నా యజమాని చేతి కింద నుంచి ఓ సన్నని వెలుగురేఖ ఇట్లాగా నడిచి వచ్చింది. ఆ సన్నని వెలుగులో నేను నా పనులన్నీ త్వరత్వరగా పూర్తి చేసుకొని నా యజమాని పనులు కూడాచేయగలిగేదాన్ని. నేను చేసిన పనులు పొందికగా నేనున్నచోటు సర్దుకొన్నట్లుగా ఉండేవి. చివరికి, నా యజమానికి ఎంత బద్ధకం వచ్చిందంటే అతని పనులన్నీ దాదాపు నేనే చేసేదాన్ని. నా పరిధి విశాలం అవటం. నేనున్నచోట వెలుగు నిండటం నాకు చాలు. చివరకు నేను నా యజమాని చేయి దాటి ఒక్కడుగు ముందుకు వేయగలిగేను. నా ముందంతా వెలుతురు. నా యజమాని చేతులకు తోడు నా సాయం కూడా చేరటంతో మా పనులు చాలా త్వరగా అయిపోయేవి. నా తీరిక సమయంలో ఎంతోమంది నా యజమాని కంటే వేగంగా, సులువుగా, తెలివిగా పనులు చక్కబెట్టడం గమనించేదాన్ని. నేర్చుకొనే అలవాటుకొద్దీ నేనవన్నీ చిటికెలో నేర్చుకొని, చాలా ముఖ్యమైన

పనులు నా యజమానికంటే తేలికగా చేసేదాన్ని. ఇప్పుడు నేను నా యజమాని చేయలేని పనులు కూడా చేయగలను. అతను బద్దకంతో వదిలేసినవన్నీ ఓపికతో అందిపుచ్చుకొన్నా. చివరికి ఓ రోజు, అలా తూనీగలా. ఎగిరే విమానాన్ని కూడా నడిపి చూపించా. చప్పట్లతో నా చుట్టూ ప్రశంసల వర్షం. అప్పుడు మొదటిసారిగా, నా యజమాని మొహంలో వికాసం తగ్గింది. కోపంతో విసుక్కోవటం మొదలుపెట్టాడు. 'అలా చిన్నగా మరుగుజ్జులా-ఉండే దానివి. ఇల్లంతా చక్కగా సరిపోయేది. ఇల్లు నిండేలా తయారయ్యావు. నాకే చోటు లేకుండా అయిపోయిందని సణిగేవాడు. నేనేం చేసేది? నాకు తెలీకుండానే నేను పెరిగిపోయాను. నేను వెలుగున్న చోట కూర్చుని, దక్షతతో, ఎన్నో పనులు సమర్థించుకోవటం కొత్తగా చూసి నన్ను ఆ పనులు నిలిపివేయమని హింసించేవాడు. అలవాటైన వెలుగును వదలుకొనేందుకు నేను ఒప్పుకునేదాన్ని కాదు. ఇక ఎన్నెన్నో ఘర్షణలు. నేను అనుభవించిన వెలుగు గురించి నా మంచాల స్నేహితులకు వర్ణించి వర్ణించి చెప్పాక వాళ్ళంతా గబగబా మంచాలు దిగి వచ్చారు. నే నేర్చుకొన్న విద్యలన్నీ చాలా ఇష్టంతో నేర్చుకొన్నారు. ఎవరైనా వెనకబడితే వాళ్ళకి అందరం కలిసి ఇంకా సాయం అందించి వాళ్ళని మాతో నడిపించేవాళ్ళం. ఇది నా యజమానికి మరింత కోపం తెప్పించింది. నా వెనకటి చోట్లో బుద్ధిగా, కుదురుగా ఉండమన్నాడు. నేనెందుకు ఒప్పుకుంటాను. అతను స్వేచ్ఛగా నడుస్తున్న ప్రదేశం, అనుభవించేవెలుగు, చేసే పనికి ప్రతిఫలం ఇప్పుడు నాకు అందుబాటులో కొచ్చాయి. ఇవి నేను వదులుకోగలనా? నా యజమాని నన్ను అక్కడి నుంచి పంపేయాలని చూశాడు. అదేం కుదరలేదు. అతను ఉన్నచోటే కదా నేనూ ఉన్నది. అతను నడిచే నేలే కదా నాకూ నడిచే అవకాశం ఇస్తోంది. ఇది గమనించి నన్ను కదిలించే అవకాశం లేదని తెలిసి, నా యజమాని తెల్లబోయాడు. ఇంకా అందమైన మంచం, పూవులు, తలగడలు, పరదాలు నా కోసం తెస్తానన్నాడు. అవన్నీ నా ఒక్కదానికే కాదు కదా. అవన్నీ మనిద్దరి కోసం. వాటి అవసరం మనిద్దరికీ ఉందన్నాను. నేనలా మాట్లాడటం అతనికి నచ్చలేదు. మంచం గురించి, అందుమీది సుఖం గురించి అలా నానోటితో చెప్పరాదన్నాడు. వెలుగులో ఉన్న చాల మందికి కూడా నేనలా మాట్లాడటం తప్పుగా తోచింది. పెద్ద చర్చ జరిగింది. ఇంకా జరుగుతూనే ఉంది. నా ఆశ, కాంతి ఈ తగవులో నా చుట్టూ ఉన్నారు. ఇంకా నా మంచాల నేస్తాలున్నారు. అందరమూ ఉమ్మడిగా, మా బ్రతుకులు ఇలాగే ఉండాలని, మేం అలాగే మాట్లాడతామనీ ఎదిరించాం. ఇప్పుడు తగవు కొనసాగుతూనే ఉంది. తర్కవితర్కాలతో మా మెదడు వేడెక్కి పోతోంది. కాసేపు ఇందులోంచి బయటకి పోవాలనిపించింది. ఎంతో విశాలమైన వెలుగుపూల ప్రదేశం ఉండగా అక్కడే ఎందుకు కొట్టుకోవడం అనిపించింది. అందుకే కష్టపడి తలుపు నెట్టుకొని ఇవతలికొచ్చాను. ఎంత కష్టపడి ఆ తలుపులు తెరవగలిగేనంటే నేనెంతో మారిపోయానన్నమాట. ఇప్పుడు నన్ను చూసుకొంటే పండు ముసలి అనిపిస్తోంది. అలా తలుపు వైపు చూస్తుంటే ఇంకో చిన్నపాప

తలుపు నెట్టుకు వస్తోంది. అలా తలుపులు నెడుతుండగానే ఆ అమ్మాయి నడివయసులోకి వచ్చేసింది. తీరా తలుపులు తెరుచుకొని బయటకు వచ్చేసరికి నాలాగా ముసలమ్మ అయిపోయింది. మేమిద్దరం ఒకళ్ళ చేతులు ఒకళ్ళం పట్టుకుని తలుపు వైపు చూస్తున్నాం. ఈసారి కాస్త త్వరగా తలుపు నెట్టుకొని ఓ చిన్న పాప వస్తోంది. బయటికి వచ్చేసరికి కాస్త యవ్వనంలోకి వచ్చింది. నా కళ్ళు మూతలు పడిపోతున్నాయి. ఎదురు చూసి ఎదురుచూసి చివరికి నా కళ్ళు పూర్తిగా మూతలు పడే సమయానికి ఓ బుల్లిపాప చాలా సులువుగా తలుపులు నెట్టుకొని బార్లా తలుపులు తెరిచి వచ్చేసింది. చాలామంది వచ్చేస్తున్నారు. నా ఆశ, కాంతిలు వాళ్లతోపాటు చాలామంది చిన్నపిల్లలు నా చుట్టూ చేరారు. అలసిపోయిన నా కళ్ళతో వాళ్ళవైపు ఆశగా చూశాను. నా ఎదురుగ్గా నా కాంతి, నా కళ్ళవెలుగు. ఉన్నట్టుండి ఆమె వంద కాంతి పుంజాలయింది. వేయిగా మారిపోయింది. లక్షల లక్షలు కాంతి పాపలు ఆమె నుంచి పుడుతూనే ఉన్నారు. నా కళ్ళు మూత పడిపోతుంటే రెప్పలు వాలిపోతుంటే తలుపుల వైపు చూచాను. ఇప్పుడు ఆకాశం అంత తలుపులు లేవు. ఎంత చిన్నగా అయిపోయాయో. కరిగిపోతున్నాయి. అందమైన నగిషీలు, తలుపులు కరిగిపోతూ... ఇప్పుడిహ అంతా వెలుగే.

★

ఆంధ్రభూమి డెయిలీ

*22.3.1997*